

**చేపల పెంపకంపై ఆసక్తి**
జిల్లాలోని యువత చేపల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త లవకుమార్ అన్నారు. - 8లో



**సైనికుల త్యాగాలు మరువలేనివి**
సైనికులు చేసిన త్యాగాలు మరువలేనివని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 36°/27°

**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రిపూట చల్లని గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### 13న 'కొమర్రాజు' శతవర్ధంతి

నడిగూడెం: మండల కేంద్రంలోని దక్కన్ ఆర్కైవ్స్ అండ్ కల్చరల్ రీసెర్చ్ సంస్థ ఆవరణ (రాజావారి కోట)లో ఈ నెల 13న శ్రీ కొమర్రాజు వెంకట లక్ష్మణరావు శతవర్ధంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.జితేంద్రబాబు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కన్నెగంటి హిమబిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలకు భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, శాసనసభ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీష్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

### పల్లె దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి



దవాఖానాను పరిశీలిస్తున్న కళ్యాణచక్రవర్తి

నడిగూడెం : పల్లె దవాఖానాల్లో అందించే వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అసంక్రమిత వ్యాధుల నివారణ జిల్లా అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలోని పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేసి, రిపోర్టులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామ స్థాయిలో పల్లె దవాఖానా వైద్యుల పర్యవేక్షణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 122 మంది సిబ్బంది ఆయా గ్రామాల్లో పనిచేస్తున్నట్లు తెలిపారు. పల్లె దవాఖానా వైద్యులు, ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ లక్ష్మీప్రసన్న, పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్.హరినాథ్, సిబ్బంది మహేశ్వరి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

### పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న గంట నాగయ్య

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంట నాగయ్య కోరారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఐఎఫ్‌టీయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదులు, మధు, నర్సిరెడ్డి, పురుషోత్తం, మల్లేష్ పాల్గొన్నారు.

### పాఠ్యపుస్తకాలు అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రభుత్వ నిబంధనకు విరుద్ధంగా తమ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న శ్రీ చైతన్య కార్పొరేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధనియాకుల శ్రీకాంత్ వర్మ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవి డిమాండ్ చేశారు. శ్రీ చైతన్య స్కూల్‌లో పుస్తకాల అమ్మకాలను వ్యతిరేకిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నా.. అధికారాలు పట్టించుకోపోవడం సిగ్గుచేటన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు స్కూల్ ఫీజులు, టైలు, బెల్టుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నా జిల్లా విద్యాధికారి స్పందించడం లేదన్నారు. అనంతరం కలెక్టర్ ఎస్.వెంకట్రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులు

## ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గౌడల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, సభ్యత్వం ఉన్న కల్లు గీత కార్మికులందరికీ మోటార్ బైకులు ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కల్లుగీత కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తుందన్నారు. మునుగోడు ఎన్నికల సందర్భంలో మంత్రులు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. గీత కార్మికులకు సేఫ్టీ మోకులు అందిస్తామని, రూ.లక్ష ఆర్థిక సహాయం చేస్తామని ఇచ్చిన హామీలను నేటికి నెరవేర్చలేదన్నారు. సొసైటీలకు భూమి, కల్లుకు మార్కెట్, జిల్లా కేంద్రంలో నీరా, తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలకు రూ.ఐదువేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎలుగూరి గోవిందు, మడ్డి అంజిబాబు జిల్లా ఉపాధ్యక్షులు అబ్బగాని భిక్షం, తుమ్మల సైదయ్య, ఉయ్యాల నగేష్, గునగంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు, గీతన్నలు

## అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ వెంకట్రావు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావుతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి.. సమస్యల పరిష్కార వేదిక కావాలన్నారు. ప్రజలు అధికారుల చుట్టూ పదే పదే తిరగకుండా వారు అందించిన అర్జీలను వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. సోమవారం ప్రజావాణిలో భూ సమస్యలపై 56, ఇతర శాఖలకు సంబంధించి 12 మొత్తం 68 దరఖాస్తులు అందాయని, వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు పంపించామన్నారు.

**వీవీ ప్యాట్లపై అవగాహన కలిగి ఉండాలి..**

వచ్చే సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ముందుగా ఈవీఎం, వీవీ పాట్లపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించిన అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో పోలింగ్ బూతుల వారీగా ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. హరితహారంలో భాగంగా ఇరిగేషన్ భూముల్లో ఎక్కువగా మొక్కలు నాటాలన్నారు. సీఎంఆర్ సేకరణపై వేగం పెంచాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు సత్వరమే చేపట్టాలని సూచించారు.

**కార్యాలయాల మార్పునకు సిద్ధంకండి**

జిల్లాలో ఈ నెల 24న సీఎం పర్యటన ఉన్నందున అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమాయత్తం కావాలని కలెక్టర్ సూచించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభం అనంతరం ఈనెల 25 నుంచి 27 వరకు శాఖల వారీగా కేటాయించిన జిల్లా కార్యాలయాలను నూతన కలెక్టరేట్‌లోకి మార్చేందుకు ఆయా శాఖల అధికారులు అన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ యాదయ్య, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# పల్లెలు మెరిసేలా..

**'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ'కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం**

- గ్రామాల మధ్య స్వచ్ఛత పోటీల నిర్వహణ
- జనాభా ఆధారంగా మూడు కేటగిరీలుగా ఎంపిక
- రాష్ట్ర స్థాయికి నామినేట్ అయిన 15 పంచాయతీలు
- 15వ తేదీ నుంచి రాష్ట్ర బృందాల పరిశీలన



చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరిలో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పట్టణాల మాదిరిగా పల్లెలు కూడా స్వచ్ఛత వైపు అడుగులు వేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పట్టణాల్లో స్వచ్ఛత సాధనకు ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ సత్ఫలితాలివ్వడంతో ఈ కార్యక్రమాన్ని పల్లెసీమలకు విస్తరించాలని నిర్ణయించింది. పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు వాటి మధ్య స్వచ్ఛత పోటీలు నిర్వహించి పురస్కారాలు అందజేయాలని పల్లెల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ–2023 కార్యక్రమాన్ని తలపెట్టింది. ఇప్పటికే స్వచ్ఛతలో మెరుగైన గ్రామాలను ఎంపిక చేసిన అధికారులు ఆ జాబితాను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించారు.

**మూడు కేటగిరీలుగా ఎంపిక**

పంచాయతీ జనాభా ప్రకారం మూడు కేటగిరీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ–2023 పురస్కారాలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో మొదటి కేటగిరీ 2వేల లోపు, రెండో కేటగిరీలో 2నుంచి 5వేలు, మూడులో 5 వేలకు పైగా జనాభా ఉన్న వాటిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపారు. జిల్లాలో 475 పంచాయతీలు ఉండగా జిల్లా స్థాయిలో ఒక్కో కేటగిరీలో ఐదు చొప్పున ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 15 పంచాయతీలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి నామినేట్ చేశారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఆయా పంచాయతీలు జాతీయ స్థాయిలో పోటీపడనున్నాయి. ఈ కార్యక్రమంపై పల్లెల్లో అవగాహన కల్పించేందుకు ఎంపీడీఓలకు బాధ్యత అప్పగించారు. ఇందుకు ప్రత్యేక అధికారులను కూడా నియమించారు.

**రాష్ట్ర స్థాయికి ఎంపికైన గ్రామాలు**

| మండలం | గ్రామాలు |
|---|---|
| తుంగతుర్తి | వెంపటి, గానుగబండ |
| మోతె | సిరికొండ, తుమ్మలపల్లి |
| ఆత్మకూర్(ఎస్) | ఏపూరు, పాతర్లపహాడ్ |
| గరిడేపల్లి | పొనుగోడు |
| హుజూర్‌నగర్ | వేపలసింగారం |
| చిలుకూరు | కొండాపురం |
| పెన్‌పహాడ్ | అనంతారం |
| కోదాడ | రెడ్లకుంట |
| మునగాల | గణపవరం |
| మద్దిరాల | రెడ్డిగూడెం |
| చివ్వెంల | జి.తిరుమలగిరి |
| నడిగూడెం | శ్రీరంగాపురం |

**15 నుంచి అధికారుల పరిశీలన**

పురస్కారాల కోసం జిల్లా స్థాయిలో ఎంపికైన వాటిని రాష్ట్ర స్థాయి అధికారుల బృందం వచ్చేనెల 15వ తేదీ నుంచి పరిశీలించనున్నారు. ఇళ్లు, జన సంచారం ఉన్న ప్రాంతాల్లో పరిశుభ్రతను పరిశీలిస్తారు. క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి, ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలు, వాస్తవంగా ఉన్న పరిస్థితిని సరి చూస్తారు. గ్రామాల్లో సుందరీకరణకు తీసుకుంటున్న చర్యలను గమనిస్తారు. మరుగుదొడ్ల వ్యర్థ పదార్థాల నిర్వహణ, వ్యర్థాల తరలింపు వివరాలను నమోదు చేస్తారు. సర్వే నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి జాతీయ స్థాయికి నామినేట్ చేస్తుంది. జాతీయ స్థాయిలో ఎంపికైన వాటికి అక్టోబర్ 2న కేంద్రప్రభుత్వం పురస్కారాలను ప్రకటించనుంది.

**ఎంపికైన గ్రామాల్లో పనుల పర్యవేక్షణ**

జిల్లాలో 5 వేలకుపైగా జనాభా ఉన్న ఐదు గ్రామాలను, 2 వేలకుపైగా జనాభా ఉన్న ఐదు గ్రామాలను, 2వేలలోపు జనాభా ఉన్న ఐదు గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాలు పోటీలో ప్రగతి కనబర్చేలా సిబ్బంది ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మురుగునీటి పునర్వినియోగం, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు, సేంద్రియ ఎరువు తయారీ, ప్లాస్టిక్ నివారణ, కిచెన్ గార్డెన్, తడి, పొడి చెత్త సేకరణ తదితర అంశాలపై దృష్టిసారించారు. రాష్ట్ర బృందం రానున్న గ్రామాల్లో ముందస్తుగా ఉన్నతాధికారులు పర్యటించి దిశా నిర్దేశం చేస్తున్నారు. రికార్డుల్లో ఉన్న లెక్కల ప్రకారం ఆయా గ్రామాల్లో పనులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

**జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తాం**

స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలను పంచాయతీలకు ఇవ్వాలని తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా నుంచి కనీసం మూడు పంచాయతీలు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక అవుతాయన్న నమ్మకం ఉంది. ఇందుకోసం ప్రయత్నాలు చేస్తున్నాం. ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారులు పర్యటించి పంచాయతీ సభ్యులకు, ప్రజలకు పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తున్నారు.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

## సీఎం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లా కేంద్రంలో ఈనెల 24న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పర్యటన ఉన్నందున అధికారులు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం, అలాగే జిల్లాలో డీపీఓ, మెడికల్ కాలేజ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మహాప్రస్థానం తదితర భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా సంబంధిత అధికారులకు పనుల విభజన చేస్తామని, ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమం విజయవంతానికి చర్యలు తీసుకోవాలన్నారు. నూతన కలెక్టరేట్ వచ్చే రహదారులన్నీ పచ్చదనంనా ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఎఫ్‌ఓ సతీష్ కుమార్‌లకు సూచించారు. నూతన భవనాలు, రోడ్లు, హెలిపాడ్ నిర్మాణ పనులు పెండింగ్ లేకుండా చూడాలని, అన్ని కార్యాలయాలు ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా పరిషత్ సీఈఓ సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్, డీఆర్‌డీఏ ఏపీడీ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

సూర్యాపేట టౌన్: 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్, పదో తరగతి అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టడీ సెంటర్లలో దరఖాస్తు ఫారాలు విక్రయించనున్నట్టు, నిర్ణీత రుసుంతో ఈ నెల 10 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు, ఆలస్య రుసుంతో ఆగస్టు 11 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకొని ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్లు తమ పరిధిలో విస్తృతంగా ప్రచారం చేసి ఎక్కువ అడ్మిషన్లు చేయాలని సూచించారు. వివరాలకు ఓపెన్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ జె.జగదీష్ సెల్: 8008403523 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

**20లోగా టీసీసీ సర్టిఫికెట్లు తీసుకోండి**

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్(టీసీసీ) డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, లోయర్ గ్రేడ్, హయ్యర్‌గ్రేడ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈనెల 20లోగా హాల్ టికెట్లతో తమ కార్యాలయంలో సంప్రదించి సర్టిఫికెట్లు పొందాలని డీఈఓ కె.అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ అభ్యర్థులు వచ్చి సర్టిఫికెట్లు తీసుకోని యెడల వాటిని ఎస్‌ఎస్‌సీ బోర్డు హైదరాబాద్‌కు పంపడం జరుగుతుందని పేర్కొన్నారు.

## బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి



మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్, చిత్రంలో వీహెచ్, చెరుకు సుధాకర్, చెవిటి వెంకన్న తదితరులు

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మాజీ ఎంపీ వీహెచ్
- సూర్యాపేటలో బీసీల ఐక్యవేదిక సమావేశానికి హాజరు

భానుపురి (సూర్యాపేట): బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు (వీహెచ్) అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జే ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీల ఐక్యవేదిక సమావేశానికి వారు ముఖ్యఅతిథుగా హాజరై మాట్లాడారు. ప్రజల బాధలు తెలుసుకోవడానికే రాహుల్‌గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేశారన్నారు. తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు సీట్లు కేటాయించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో 54 శాతం బీసీలుంటే వారిని సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకే పరిమితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీని చంపిన గాడ్సేను బీజేపీ దేవుడంటోందని, ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి కృతజ్ఞతగా రాష్ట్రంలో ప్రజలంతా మద్దతుగా నిలిచి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలన్నారు. టీఆర్‌ఎస్.. బీఆర్‌ఎస్‌గా మారినప్పుడే కేసీఆర్ పని అయిపోయిందని చెప్పారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లకోసం అధికార పార్టీ నాయకులు రూ.2లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రానికి ఎవరైతే వ్యతిరేకంగా ఉంటారో.. మాట్లాడుతారో వాళ్లపై సీబీఐ ఎంక్వయిరీలు ఉంటున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, బీసీలందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సహకరించాలన్నారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షులు చెరుకు సుధాకర్, లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు బీర్ల అయిలయ్య, పున్న కైలాష్ నేత, రాపోలు జయప్రకాశ్, పీసీసీ సభ్యుడు కృష్ణయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అనురాధ కిషన్‌రావు, నల్లగొండ జిల్లా సీనియర్ నాయకులు సిరాజ్‌ఖాన్, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్, భువనగిరి నియోజకవర్గ సీనియర్ నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, ఓబీసీ నాయకులు, జెడ్పీటీసీలు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## శివాలయంలో పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీస్వామివారికి నిత్య కైంకర్యాలు చేపట్టి, మండపంలో నిత్య రుద్రహవనం, మహాశివుడికి అభిషేకం, అర్చనలు గావించారు. అనంతరం ముఖ మండపంలోని స్ఫటికలింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలో స్వయంభూలకు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి.

# ఇళ్లకు డిజిటల్ నంబర్లు వేసేదెప్పుడో..!

- మున్సిపాలిటీల్లో మొదలుకాని ప్రక్రియ
- ఎనిమిది నెలల క్రితమే ఆదేశాలు జారీ
- ఇప్పటికే ఇళ్లు, భవనాల వివరాల సేకరణ
- పాత నంబర్ల గుర్తింపులో అధికారులకు తప్పని ఇబ్బందులు



తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయం

| మున్సిపాలిటీ | వార్డులు | నివాస గృహాలు |
|---|---|---|
| సూర్యాపేట | 48 | 30,674 |
| కోదాడ | 35 | 14,418 |
| హుజూర్‌నగర్ | 28 | 6,943 |
| తిరుమలగిరి | 15 | 5,950 |
| నేరేడుచర్ల | 15 | 2,819 |

తిరుమలగిరి(తుంగతుర్తి): మున్సిపాలిటీల ఆదాయం పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు పూనుకుంటోంది. ఇందులో భాగంగా ఎగవేతదారుల నుంచి కచ్చితంగా ఆస్తి పన్ను వసూలు చేయాలని నిర్ణయించింది. భవిష్యత్తులో పట్టణవాసులకు ఎదురయ్యే ఇబ్బందులను అరికట్టేందుకు మున్సిపాలిటీల్లో డిజిటల్ ఇంటి నంబర్లు వేయాలని సంకల్పించింది. అన్ని రంగాల్లో సాంకేతిక వినియోగం పెరగడంతో అన్ని మున్సిపాలిటీల్లో డిజిటల్ నంబర్లు ఏర్పాటు చేయాలని ఎనిమిది నెలల క్రితం ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఇల్లు, వ్యాపార సముదాయాల వివరాలను అధికారులు సేకరించారు.

**గతంలో ఇష్టానుసారంగా ఇళ్లకు నంబర్లు..**

కొత్త మున్సిపాలిటీల్లో ఇంటి నంబర్ల సమస్య సిబ్బందిని వేధిస్తోంది. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు వార్డుల వారీగా కాకుండా ఇష్టానుసారంగా ఇంటి నంబర్లు కేటాయించారు. దీంతో ప్రస్తుతం మున్సిపాలిటీల్లోకి మారిన కొన్ని గ్రామాల్లోని వార్డుల్లో ఏ ఇల్లు ఎక్కడ ఉంది అనేది స్పష్టంగా తెలియడం లేదు. ఇళ్ల గుర్తింపునకు ఇబ్బందులు తప్పడం లేదు. పాత మున్సిపాలిటీల్లో వార్డుల విభజన చేపట్టినప్పుడు క్రమ సంఖ్య ఆధారంగా ఇంటి నంబర్లు ఇచ్చారు. అయితే ఈ సమస్య కొత్త మున్సిపాలిటీల్లో మరీ తీవ్రంగా ఉంది. 2022 డిసెంబర్‌లో మొదలు పెట్టి ఈ ఏడాది మార్చి వరకు కొత్త డిజిటల్ నంబర్లు కేటాయించాలని నిర్ణయించారు. అయితే ఎక్కడా ఆ పనులకు అడుగులు పడలేదు.

**ప్రయోజనాలు ఇవే..**

గూగుల్ మ్యాప్ ఆధారంగా ఇళ్లకు డిజిటల్ నంబర్ల ఏర్పాటు ప్రక్రియ ఉంటుంది. పాత నంబర్ల స్థానంలో అక్షాంశాలు, రేఖాంశాల దిశలను గుర్తిస్తూ వరుస క్రమంలో కొత్తవి కేటాయిస్తారు. గతంలో పక్క పక్కన ఉన్న ఇళ్లకు బై నంబర్లు కేటాయించారు. అపార్ట్‌మెంట్ భవనాలకు కేటాయించే వాటిలో పారదర్శకంగా ఉంటుంది. నంబర్ చూడగానే ఇల్లు ఎక్కడ ? ఏ వార్డులో ఉందనేది స్పష్టంగా తెలుస్తోంది. ప్రాంతం పేరు, కాలనీ, రోడ్డు నంబర్, అంతస్తుల వివరాలు పక్కాగా నమోదు చేస్తారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన, సర్వేలకు, ఇతరత్రా కార్యక్రమాల్లో ప్రాంతాలు, నివాసాల గుర్తింపు సులభతరమవుతుంది. అంతే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చేరుకోవడానికి అవకాశం ఉంటుంది.

**రెండు, మూడు అంతస్తులు ఉన్నా..**

మున్సిపాలిటీల్లో చాలా మంది పన్నులు చెల్లించడం లేదు. రెండు, మూడు అంతస్తుల భవనాలు ఉన్న వారు కేవలం ఒక్క ఇంటికి మాత్రమే పన్ను చెల్లిస్తున్నారు. మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా పైఅంతస్తులు నిర్మించారు. దీంతో ఆదాయానికి గండి పడుతుంది. ఈ విధానం మొత్తం పాత, కొత్త మున్సిపాలిటీల్లో కొనసాగుతుంది. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి మున్సిపాలిటీల్లో ఇళ్లకు డిజిటల్ నంబర్లు వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది పూర్తిగా అమలైతే మున్సి పాలిటీలకు ఆదాయం పెరుగుతుంది. కానీ, డిజిటల్ నంబర్లు వేసే ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

## బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలి



సూర్యాపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : హైదరాబాద్‌లోని మన్సూరాబాద్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 15వ తేదీన జరిగే బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లమల్ల నరసింహ పిలుపునిచ్చారు. ఈ మేరకు ముద్రించిన ప్లీనరీ పోస్టర్‌ను సోమవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డులో జ్యోతిరావు పూలే విగ్రహం దగ్గర బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను పాలకులు ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో మేము ఎంతో మాకంత వాటా కేటాయించాలన్నారు. బీసీలకు 50శాతం సీట్లు కేటాయించి అన్ని పార్టీలు కూడా బీసీ డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించి రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు, పీసీసీ ఓబీసీ విభాగం కోఆర్డినేటర్ బి.రమేష్‌గౌడ్, కోడి లింగయ్య, భూపతి నారాయణ, బైరు విజయకృష్ణ, రవి, పుల్లయ్య, వెంకన్నయాదవ్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యువకుడి అదృశ్యం.. కేసు నమోదు


ప్రసాద్ (ఫైల్)

హుజూర్‌నగర్: పట్టణానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు సోమవారం ఫిర్యాదు అందడంతో హుజూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ లింగారెడ్డి తెలి పిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌లోని సుందరయ్య కాలనీకి చెందిన సుంకరి కనకమ్మ పెద్ద కుమారుడు ప్రసాద్ ఈ నెల 7వ తేదీన బట్టలు ఇస్త్రీ చేయించుకుని వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం అతడి తల్లి కనకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

### ఆలయంలో చోరీకి యత్నం


ఆలయ తలుపులు పగులగొట్టిన దొంగలు

భువనగిరి: మండలంలోని రాయగిరి గ్రామ చెరువు కట్టపై గల కట్ట మైసమ్మ దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. రోజుమాదిరిగా సోమవారం ఉదయం ఆలయ పూజారులు దేవాలయం వద్దకు వెళ్లగా.. తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండటం గమనించి మిగతా పూజారులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆలయాన్ని, హుండీని పరిశీలించారు. ప్రతిరోజు హుండీలో భక్తులు వేసే కానుకలను తీసి భద్రపర్చడంతో దొంగలు ఏమీ ఎత్తుకెళ్లలేదని పూజారులు పేర్కొన్నారు.

### రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి: భువనగిరి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి 8గంటల సమయంలో కాజీపేట–సికింద్రాబాద్ రైలు మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉంటాడని, తెలుపు రంగు చొక్కా, లైట్ ఆకుపచ్చ రంగు ప్యాంట్ ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మెడలో లైట్ ఆరెంజ్ రంగు టవల్ ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు కేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పీ ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712658619, 8712568454 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# ప్రభుత్వ స్థలంలో వెలిసిన గుడిసెలు

- గతంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఆ భూమి కేటాయింపు
- అనివార్య కారణాలతో పంపిణీ కాని పట్టాలు


ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకున్న గుడిసెలు

డిండి: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలివ్వాలని డిండి మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామ సర్పంచ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో దాదాపు 23 సంవత్సరాలు నుంచి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఉన్నట్టుండి సోమవారం గుడిసెలు వెలిశాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల–కోదాడ హైవేకు ఆనుకొని ఉన్న ఎర్రగుంటపల్లి స్టేజీ వద్ద 1999 సంవత్సరం జూన్ 13వ తేదీన గ్రామానికి చెందిన 55 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్లు 102, 105లో 2.30 ఎకరాల వ్యవసాయ భూమని అదే గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద కొనుగోలు చేసింది. ఆ తర్వాత అర్హులైన వారి జాబితాను అధికారులు తయారుచేసినప్పటికీ ఇళ్ల స్థలాల పట్టాలు మాత్రం పంపిణీ చేయలేదు. అప్పటి నుంచి దాదాపు 23 సంవత్సరాల పాటు ఖాళీగా ఉన్న అట్టి ప్రభుత్వ స్థలంలో గతేడాది నుంచి అంగన్‌వాడీ కేంద్రం, తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణంతో పాటు పలు ప్రభుత్వ భవనాలు నిర్మించాలని కొంతమంది అధికారులు ప్రయత్నాలు చేశారు. కానీ నిరుపేదలకు కేటాయించిన స్థలంలో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే ఊరుకునేది లేదని పలువురు లబ్ధిదారులు పేర్కొనడంతో భవనాల ఏర్పాటుకు అనుమతుల ప్రక్రియ ఆగిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం అదే స్థలంలో 40 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఈ నెల 6వ తేదీన గ్రామ సర్పంచ్ పేట రాధ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో పాత జాబితాలోని 55 మందిని కాకుండా 40 మందికి మాత్రమే ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులకు నూతన జాబితాను పంపిచారన్న అనుమానంతో పాత జాబితాలోని పలువురు లబ్ధిదారులు ఖాళీ ప్రదేశంలోని పిచ్చి మొక్కలను తొలగించి గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. పాత జాబితానుసరించి 55 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అర్హులందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు అందుతాయని పేర్కొన్నారు. ఆర్‌ఐ శ్యాంనాయక్ సమక్షంలో అట్టి స్థలంలో ఏర్పాటు చేసిన గుడిసెలను వీఆర్‌ఏ తొలగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

# గంజాయి తరలిస్తూ పట్టుబడిన యువకులు

- అరెస్ట్ చేసిన పోలీసులు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కొత్తగూడెం అర్బన్: సినీఫక్కీలో తప్పించుకుపోతున్న గంజాయి రవాణాదారులను సోమవారం భద్రాద్రి కొత్తగూడెం పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ కథనం ప్రకారం.. గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఇల్లెందు క్రాస్ రోడ్డులో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడేనికి చెందిన రాంరాకేష్, జి.వసంత్, రంగారెడ్డి జిల్లా బాల్‌రెడ్డినగర్‌కు చెందిన లావుడ్యా సాయి కారులో ఏపీలోని చింతూరు నుంచి 13.5 కేజీల ఎండు గంజాయి తీసుకెళ్తున్నారు. అయితే, గంజాయి కనిపించకుండా కారు డోర్‌లో ఫిక్స్ చేయగా... పోలీసులను గమనించి అతివేగంతో కొత్తగూడెం మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో సుజాతనగర్ పోలీసులు రహదారిపై వాహనాన్ని అడ్డుగా పెడితే ఆ వాహనంతో పాటు మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా కారు నిలిచిపోయింది. ఈమేరకు పోలీసులు రూ.2.7లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా, నిందితుల్లో ఒకరు బీటెక్, మరొకరు డిగ్రీ చదువుతుండగా, ఇంకొకరు షాపు నడుపుతున్నారు. వీరు వ్యసనాలకు అలవాటుపడి గంజాయి తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

## బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి


నల్లగొండలో పార్టీ కార్యాలయాన్ని సందర్శించి, ఎమ్మెల్యేలతో చర్చిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సోమవారం సందర్శించారు. నల్లగొండ, తుంగతుర్తి, హుజూర్‌నగర్ శాసనసభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, శానంపూడి సైదిరెడ్డిలతో కలిసి పార్టీ కార్యాలయం లోపల పరిశీలించారు. కార్యాలయం లోపల ఫర్నిచర్, స్టేజీ తదితర వివరాలను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యాలయం భవన నిర్మాణం, మోడల్ తదితర విషయాలను సంబంధిత కాంట్రాక్టర్ మంత్రికి వివరించారు. ఇదే మోడల్‌ను సూర్యాపేటలో అమలు కోసం మంత్రి పరిశీలించినట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ పంకజ్‌యాదవ్, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, సమీకో ఆప్షన్ మెంబర్ జమాల్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

### కుల బహిష్కరణ కేసులో 10మంది బైండోవర్

నడిగూడెం: మండల పరిధిలోని వల్లాపురం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తుడు దుస్సా వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఇటీవల కుల బహిష్కరణ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం నడిగూడెం పోలీసులు ముదిరాజ్ కులానికి చెందిన 10మందిని తహసీల్దార్ టి. నాగేశ్వరరావు ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్‌ఐ పి. ఏడుకొండలు తెలిపారు.

### శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామీ, రాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత మాంగళ్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదే విధంగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు ఉన్నారు.

## భారీ చెట్లు నరికివేత


ఏవీకేతండాలో చెట్ల దుంగలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న కూలీలు

ఆత్మకూర్ (ఎస్) : పాఠశాలల అభివృద్ధి, హరిత హారం పేరుతో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పచ్చదనం కోసం చెట్లను పెంచకపోగా ఏళ్ల నాటినుంచి నీడనిస్తున్న పెద్ద పెద్ద వృక్షాలను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని ఏవీకే తండా పాఠశాలలో ఏళ్ల క్రితం నాటిన వేపచెట్లతో పాటు ఇతర నీడనిచ్చే చెట్లు భారీగా పెరిగాయి. ఈ చెట్ల కారణంగా పాఠశాల ఆవరణ చల్లగా ఉండడంతో పాటు ఆహ్లాద వాతావరణం ఏర్పడుతుంది. ఉపాధ్యాయులు కొన్ని సమయాల్లో పిల్లలకు ఈ చెట్ల కిందనే పాఠాలు బోధించేవారు. అయితే అదనపు తరగతి గది, ప్రహరీ మంజూరు కాగా ఇదే అదునుగా స్థానిక సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు కలిసి ఈ చెట్లను ఓ వ్యాపారికి గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకున్నట్లు తండావాసులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ ధారాసింగ్‌ను వివరణ కోరగా పాఠశాలకు ప్రహరీ, అదనపు గది మంజూరైందన్నారు. వీటి కోసం చెట్లను తొలగించినా ఎవరికి విక్రయించ రాదని, కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ

యాదగిరిగుట్ట : దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట పీఏసీఎస్ ఆధ్వర్యంలో పలువురు రైతులకు సోమవారం దీర్ఘ కాలిక, స్వల్పకాలిక రుణాల మంజూరీ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో పంజాబ్ ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉండేదని, ఇప్పుడు తెలంగాణ ప్రథమ స్థానానికి ఎదిగిందన్నారు. 2014కు ముందు 21లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా స్వరాష్ట్రంలో కోటి 30లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతుందన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతిగా వ్యవహరిస్తున్నారని, ఉచిత కరెంట్, రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలు అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.యాదగిరిగుట్ట పీఏసీఎస్‌లో మూడేళ్ల క్రితం రూ.2.35లక్షలు మాత్రమే టర్నోవర్ ఉండగా ఇప్పుడు రూ.18 కోట్లకు పైగా చేరిందన్నారు. పీఏసీఎస్ సొంత నిధుల నుంచి గెదెలు, గొర్రెలకు దీర్ఘ కాలిక అప్పులు, భూమి లేని వారికి రూ.50 వేల నుంచి రూ.70వేల వరకు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎండీ ఆదేశాలతోనే ప్రహరీ నిర్మాణం


ఆర్టీసీ అధికారులతో వాదనకు దిగిన కాంగ్రెస్ నాయకులు, దుకాణాదారులు

చౌటుప్పల్: ఆర్టీసీ స్థలాల పరిరక్షణలో భాగంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో బస్టాండ్‌లకు ప్రహరీలు నిర్మిస్తున్నామని ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం జిల్లా ఈఈ ఎంవీ సత్యనారాయణ తెలిపారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌ను అధికారులతో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ప్రతిపాదించిన ప్రహరీ ఆర్టీసీ స్థలంలోనే ఉందన్నారు. కాంప్లెక్స్‌ల వైపు తమ సంస్థ స్థలంలో భూమి లెవల్‌లోనే బేస్‌మెంట్ నిర్మిస్తామని తెలిపారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మ, స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

**రాజకీయ కక్షసాధింపులో భాగంగానే..**

ఆర్టీసీ అధికారులు వచ్చిన విషయం తెలుసుకున్న రాజీవ్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖయ్యూం, ఐఎన్‌టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయ రామచంద్రం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక కాంప్లెక్స్‌లకు చెందిన దుకాణాదారులు అక్కడికి వెళ్లారు. ప్రహరీ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. ఇన్ని సంవత్సరాలుగా లేని ప్రహరీ నిర్మాణం అంశం కొత్తగా రావడానికి రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ధ్వజమెత్తారు. ప్రజల విన్నపాన్ని విస్మరించి ప్రహరీ నిర్మాణం చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. రెండ్రోజులు గడువు కావాలని కోరగా అధికారులు సమ్మతించారు.

## కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న షహీనా

హుజూర్‌నగర్‌రూరల్: కుటుంబ కలహాలతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామానికి చెందిన షేక్ యూసుఫ్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి షేక్ షహీనాతో 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి 6వ, 9వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా చాలాకాలం ఇద్దరు వేర్వేరుగా ఉండగా.. ఇటీవలే మళ్లీ ఇరువురు కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇద్దరికీ గొడవ కావడంతో యూసుఫ్ పురుగుల మందు తాగాడు. అది గమనించిన షహీనా ఇంట్లోని విద్యుత్ వైర్ పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు గమనించి వారిద్దరిని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## పత్తి చేనులో గుంటుక తోలుతూ రైతు మృతి


భిక్షం (ఫైల్)

శాలిగౌరారం: పత్తి చేనులో గుంటుక తోలుతున్న ఓ రైతు గుండెపోటుతో చేనులోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కకొండారం గ్రామానికి చెందిన సెగ్గెం భిక్షం(49)కు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. మరో ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని మొత్తం 10 ఎకరాలలో పత్తి సాగుచేశాడు. సోమవారం తన పొలంలోని పత్తి చేనులో 10మంది మహిళా కూలీలు కలుపు తీస్తుండగా.. మరోపక్క భిక్షం గుంటుక తోలుతున్నాడు. సాయంత్రం 4.30గంటల సమయంలో గుండెపోటుతో భిక్షం పొలంలోనే కుప్పకూలిపోయాడు. మహిళా కూలీలు గమనించి భిక్షంను సమీపంలోని చెట్టు కిందకు తరలించారు. అనంతరం 108 వాహనంలో నకిరేకల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, అవివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# సాగర్ జలాశయంలో సెయిలింగ్ రేస్


సాగర్ జలాశయంలో వాయిలర్‌లలో సెయిలింగ్ చేస్తున్న ఎన్‌సీసీ నేవీ క్యాడెట్స్

నాగార్జునసాగర్ : శిక్షణలో భాగంగా నావెల్ క్యాడెట్లకు సోమవారం నాగార్జునసాగర్ జలాశయంలో వాయిలర్ సెయిలింగ్ రేస్ నిర్వహించారు. జలాశయంలో నాలుగు వాయిలర్‌లతో రేస్ సాగింది. శిక్షణ పొందేవారు ముందు వెళ్తుండగా వారికి రక్షణగా ఎక్స్‌పెడిసన్ సేఫ్టీ ఆఫీసర్స్ వారి వెంట స్పీడ్‌బోట్లలో వెళ్లారు. వీరితో పాటు కమాండర్ భరత్‌భూషన్, లెఫ్టినెంట్ కమాండర్ హర్‌ప్రీత్‌సింగ్ తదితరులు ఉన్నారు.

## చేపల పెంపకంపై యువత, రైతులు ఆసక్తి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్

పెన్‌పహాడ్: ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నీటి వనరులు పుష్కలంగా లభించడంతో యువత, రైతులు చేపల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారని గరిడేపల్లి మండంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ అన్నారు. సోమవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని జల్మాలకుంట గ్రామంలో కేవీకే ఆధ్వర్యంలో జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాల నుంచి రాష్ట్రంలో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద రూ.6వేల కోట్లు బడ్జెట్ కేటాయించబడిందని, మత్స్య పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చే వారికి సబ్సిడీ కల్పించి ప్రోత్సహిస్తుందని అన్నారు. దేశ ఆహార భద్రతకు దోహదపడే విధంగా ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులను అవలబించడం, చేపల ఉత్పాదకతను కాపాడుకోవడంలో మత్స్య రైతులు ఎంతగానో కృషి చేస్తున్నారని న్నారు. కేవీకే ద్వారా యువతకు, రైతులకు జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా 300పైగా రైతులకు మత్స్య పరిశ్రమపై స్వల్ప, దీర్ఘకాలిక శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. చేపల చెరువులు నిర్మించదలచిన రైతులకు తగు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి తోడ్పాటు అందిస్తున్నామని అన్నారు. తద్వారా నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి. నరేష్, కిరణ్, నరేష్, రైతులు డి. నాగేందర్, దేవుల, నవీన్, రమణ, లక్ష్మణ్, శంకర్, బోడు, జెత్‌రామ్లు తదితరులు పాల్గొన్నారు.





# ఏరోబిక్ సాగు ఎంతో మేలు




నడిగూడెం: వర్షాభావ పరిస్థితులు, నీటి వనరులు తగ్గిపోతున్న నేపథ్యంలో వరి సాగు చేసే రైతులు ఏరోబిక్ పద్ధతిని అనుసరించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు సూచిస్తున్నారు. ఏరో బిక్ పద్ధతిలో మొదట వరి విత్తనాలను పొడి దుక్కుల్లో విత్తుకొని ఆ తర్వాత కాల్వలు, బావులు, బోర్లలో భూ గర్భ జలాలు పెరిగిన తర్వాత పొలాలకు నీటి తడులు అందించి మాగాణి సాగుగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. ఏరోబిక్ సాగు వలన కలిగే లాభాలు ఆయన మాటల్లోనే..

- విత్తనాలను నేరుగా పొడి దుక్కుల్లో విత్తుకోచ్చు.
- పొలాన్ని దమ్ము చేయడం, నారుమడి పోసుకోవడం, నారుతీత, నాట్లు వేయడం ఏవీ అవసరం లేదు. దీని ఫలితంగా సాగు ఖర్చు, సమయం ఆదా అవుతుంది.
- నేలను దమ్ము చేసే పని ఉండదు.
- నేల భౌతిక స్థితి మెరుగ్గా ఉంటుంది.


ఏరోబిక్ పద్ధతిలో నేరుగా పొడి దుక్కిలో వరి విత్తనాలు విత్తుతున్న రైతు

- పదే పదే దమ్ము చేయడం వలన సాగు నేలల్లో బలం తగ్గిపోయి అపరాల దిగుబడి తగ్గిపోతుంది. అయితే ఏరోబిక్ పద్ధతిలో సాగుతో నేల బలం తగ్గిపోదు.
- భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగదు.
- తక్కువ మంది కూలీలతో విత్తుకోవచ్చు.


ఏపుగా పెరిగిన వరి పంట

- తక్కువ ఖర్చుతో సీడ్ డ్రిల్ ద్వారా కూడా విత్తుకోవచ్చు.
- తొలకరి జల్లులు పడిన వెంటనే విత్తుకోవాలి.
- నారు పోయడం, నాట్లు వేసేందుకు కూడా ఖర్చు ఉండదు.
- 10 రోజుల ముందే పంట కోతకు వస్తుంది.

**కలుపే ప్రధాన సమస్య**

కలుపు ప్రధాన సమస్య కాబట్టి ఎక్కువగా రసాయనాలు వాడాల్సి ఉంటుంది. విత్తిన రెండు రోజుల్లోపు ఎకరానికి పెండిమిథాలిన్ 1–1.5 లీటర్లు పిచికారీ చేయాలి. 15 నుంచి 20 రోజులకు పొలంలో గడ్డిజాతి కలుపు అధికంగా ఉంటే సహైలోపాప్ బ్యూటైల్ 400 మి.లీ. లేదా అన్ని రకాల కలుపు ఉంటే విస్ పైరిబాక్ సోడియం 80 నుంచి 100 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి.

- 25 నుంచి 40 శాతం సాగు నీరు ఆదా అవుతుంది.

**సీడ్ డ్రిల్‌తో విత్తే విధానమే మేలు..**

ట్రాక్టర్‌కు అమర్చిన సీడ్ డ్రిల్‌తో విత్తడం వల్ల కొంచెం లోతుగా విత్తనం భూమిలోకి చొచ్చుకెళ్లడంతో వేరు వ్యవస్థ విస్తరిస్తుంది. దీని వల్ల వర్షాలు, ఈదురు గాలులకు పైరు పడిపోకుండా బలంగా నిలబడుతుంది. ఈ పద్ధతిని అనుసరిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చు.

**పంట దిగుబడి**

సాధారణ వరి సాగు పద్ధతి కన్నా ఈ విధానంలో 5 నుంచి 10 బస్తాల దిగుబడి అదనంగా వస్తుంది. పంట కూడా నాణ్యంగా వస్తుంది.